సాక్షి
మహబూబ్‌నగర్

శుక్రవారం । 31 । జనవరి । 2025



వైభవంగా బ్రహ్మోత్సవాలు

జోగుళాంబ అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి.

వివరాలు 8లో ▸



ఆశజూపి.. డబ్బు కాజేసి

సైబర్ నేరగాళ్లు కొత్త ఎత్తుగడలతో మోసాలకు పాల్పడుతున్నారు.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
35.7 /12.1

ఆకాశం కొంత మేర మేఘాలు ఉంటాయి. ఉదయం, రాత్రి చలిగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

పీయూ డిగ్రీ సెమిస్టర్ ఫలితాలు విడుదల




మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ పరిధిలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాలల్లో చదువుతున్న 1, 3, 5 సెమిస్టర్లకు సంబంధించిన ఫలితాలను వీసీ శ్రీనివాస్ గురువారం విడుదల చేశారు. ఈ మేరకు సెమిస్టర్–1లో 32.61 శాతం మంది మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. మొత్తం పరీక్షలకు 19,662 మంది విద్యార్థులు హాజరైతే 6,411 మంది ఉత్తీర్ణులు కాగా.. 13,202 మంది ప్రమోట్ అయ్యారు. 49 మంది విద్యార్థులు మాల్ ప్రాక్టీస్ కింద బుక్ అయ్యారు. సెమిస్టర్–3లో 15,444 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైతే 37.75 శాతంతో 5,830 మంది ఉత్తీర్ణులయ్యారు. మొత్తం 9,589 మంది ప్రమోటయ్యారు. 25 మంది విద్యార్థులు మాల్ ప్రాక్టీస్ కింద బుక్ అయ్యారు. 5వ సెమిస్టర్‌లో 11,343 మంది విద్యార్థులు పరీక్ష హాజరైతే 48.81శాతంతో 5,537 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. 5,793 మంది ప్రమోట్ అయ్యారు. 13 మంది విద్యార్థులు మాల్ ప్రాక్టీస్ కింద బుక్ అయ్యారు. ఈ సందర్భంగా వీసీ శ్రీనివాస్ మాట్లాడుతూ యాజమాన్యాలు, అధ్యాపకులు చర్యలు తీసుకుని మరిన్ని ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. రీవాల్యుయేషన్ కోసం ఫిబ్రవరి 2వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ చెన్నప్ప, కంట్రోలర్ రాజ్‌కుమార్, మధుసూదన్‌రెడ్డి, చంద్రకిరణ్, శాంతిప్రియ, విజయలక్ష్మి, అరుంధతి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రయోగ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఫిబ్రవరి 3 నుంచి 22 వరకు ఇంటర్ ప్రయోగ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహణపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇంటర్ ప్రయోగ పరీక్షలకు 36 కేంద్రాలు, ఒకేషనల్ పరీక్షలకు 13 కేంద్రాల్లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్ సెకండియర్ విద్యార్థులు 8,392 మంది, ఒకేషనల్ ఫస్టియర్ విద్యార్థులు 1,996 మంది, సెకండియర్ విద్యార్థులు 1,721 మంది ప్రాక్టికల్ పరీక్షలకు హాజరు కానున్నట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని పరీక్ష కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని, అలాగే నిరంతర విద్యుత్, తాగునీరు ఏర్పాటు చేయాలని పారిశుద్ధ్య పనులకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రతి పరీక్ష కేంద్రంలో వైద్యశిబిరం ఏర్పాటు చేయాలని, ఆర్టీసీ బస్సులు పరీక్షల రూట్లలో నడపాలని, విద్యార్థులు ఎక్కడా ఇబ్బందులు పడకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని సూచించారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో ల్యాబ్‌లలో, కారిడార్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఏఎస్పీ రాములు, ఆర్‌డీఓ నవీన్, డీఐఈఓ కౌసర్ బేగం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బాదేపల్లి యార్డుకు పోటెత్తిన వేరుశనగ



జడ్చర్ల: బాదేపల్లి మార్కెట్‌యార్డుకు గురువారం వేరుశనగ పోటెత్తింది. వివిధ ప్రాంతాల నుంచి యార్డుకు 7,800 క్వింటాళ్ల వేరుశనగ విక్రయానికి వచ్చింది. ఈ సీజన్‌లో ఇంతపెద్ద మొత్తంలో వేరుశనగ మార్కెట్‌కు రావడం ఇదే మొదటిసారి. క్వింటాల్ వేరుశనగ గరిష్ఠంగా రూ.6,222, కనిష్ఠంగా రూ.4,029 ధరలు పలికాయి. అదేవిధంగా కందులకు క్వింటాల్ గరిష్ఠంగా రూ.6,749, కనిష్ఠంగా రూ.5,680, మొక్కజొన్న గరిష్ఠంగా రూ.2,418, కనిష్ఠంగా రూ.5,454 ధరలు లభించాయి.

ఆశలు పట్టాలెక్కేనా?

ప్రతిఏడాది ఉమ్మడి జిల్లాకు దక్కని కేటాయింపులు

- ఈసారి కేంద్ర బడ్జెట్‌లోనైనా మోక్షం కలిగేనా?
- కొత్త రైల్వే లైన్ల కోసం జిల్లావాసుల ఎదురుచూపులు
- కృష్ణా–వికారాబాద్, గద్వాల–డోర్నకల్ లైన్లు సర్వేకే పరిమితం
- ఊరిస్తున్న గద్వాల–మాచర్ల రైల్వే లైన్

మరికొన్ని గంటల్లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో ఉమ్మడి పాలమూరు జిల్లాకు అవసరమైన కేటాయింపులు దక్కాలని ప్రజలు ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రవాణా వ్యవస్థ మరింత మెరుగుపడాల్సి ఉంది. ప్రజారవాణా, అభివృద్ధికి రైల్వే సదుపాయం కీలకం కాగా.. ప్రతిసారి కొత్త రైల్వే లైన్ల ఏర్పాటు ప్రతిపాదనలకే పరిమితం అవుతుంది. ఇందుకోసం అవసరమైన నిధుల కేటాయింపుల్లో అన్యాయం జరుగుతోందన్న విమర్శలు ఉన్నాయి. కొత్తగా ప్రతిపాదించిన రైల్వేలైన్లకు నిధులు కేటాయించాలని ఉమ్మడి జిల్లాలోని ఎంపీలు డీకే అరుణ, మల్లురవి ఇప్పటికే కేంద్రప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. నాలుగున్నర దశాబ్దాలుగా ఊరిస్తున్న గద్వాల–మాచర్ల రైల్వేలైన్‌కు మోక్షం కలుగుతుందా.. లేక ఆనవాయితీగా కొద్దిపాటి కూతలకే పరిమితమవుతుందా అనే విషయం శనివారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌తో తేలనుంది.

– సాక్షి, నాగర్‌కర్నూల్

ప్రతిసారి కేంద్రప్రభుత్వం ప్రవేశపెడుతున్న బడ్జెట్‌లో ఉమ్మడి జిల్లాలోని రైల్వే ప్రాజెక్టులకు, నూతన రైల్వే లైన్లకు నిధుల మంజూరుపై అన్యాయం జరుగుతోంది. ముద్కేడ్–సికింద్రాబాద్ మీదుగా అకోల–డోన్ (పూర్ణ–ముద్కేడ్, బొల్లారం–మహబూబ్‌నగర్ మినహా) డబ్లింగ్ ప్రాజెక్టు కోసం ఇప్పటి వరకు రూ.220 కోట్లు కేటాయించారు. మహబూబ్‌నగర్ వరకు డబ్లింగ్ పూర్తయిన భాగాన్ని మినహాయించి ముద్కేడ్–డోన్ మధ్య ప్రాజెక్టు అమలు కోసం అంచనాలను తయారు చేశారు. రెండేళ్ల కిందట బడ్జెట్‌లో మహబూబ్‌నగర్ నుంచి డోన్ వరకు డబ్లింగ్ లైన్‌కు గత ఏడాది బడ్జెట్‌లో రూ.60 కోట్లు కేటాయించారు. ఈ మేరకు మహబూబ్‌నగర్ నుంచి డోన్ వరకు సెక్షన్‌ల ప్రకారం డబ్లింగ్ లైన్ పనులు కొనసాగుతున్నాయి.

ప్రతిపాదనల వద్దే ముగిసిన రైల్వే లైన్లు

ఈసారి బడ్జెట్‌లోనైనా కృష్ణా–వికారాబాద్, గద్వాల–డోర్నకల్ నూతన లైన్లకు నిధులు కేటాయిస్తారనే అంచనాలు ఉన్నాయి. ఎప్పుడో 1988 నుంచే నారాయణపేట జిల్లా కృష్ణా నుంచి వికారాబాద్ వరకు 87 కిలోమీటర్ల మేర రైల్వే లైన్‌కు రూ.90 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇప్పటివరకు ఈ లైన్ కోసం ఐదుసార్లు సర్వే చేశారు. గత ఏడాది ఈ రైల్వే ప్రాజెక్టు కోసం ఫైనల్ లొకేషన్ (ఎఫ్ఎల్ఎస్)కు రైల్వే బోర్డు ఆమోదం తెలిపింది. ఈ లైన్ పరిధిలో 316 కిలోమీటర్ల వరకు సర్వే చేయాల్సి ఉండగా, ఇందుకోసం మొత్తం రూ.7.91 కోట్ల నిధులు కేటాయించారు. అయినప్పటికీ పనులు పూర్తిచేసేందుకు ప్రతి బడ్జెట్‌లో ఈ లైన్‌కు నిధులు కేటాయించడం లేదు.

- గద్వాల–డోర్నకల్ (220 కిలోమీటర్లు) లైన్‌కు 1992లో రూ.190 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించారు. గద్వాల–మాచర్ల లైన్ కోసం నాలుగున్నర దశాబ్దాలుగా వనపర్తి, గద్వాల, నాగర్‌కర్నూల్ జిల్లావాసులు ఎదురుచూస్తున్నారు. మూడుసార్లు సర్వే చేసి వదిలేశారు. ప్రతి ఏడాది ఊరిస్తున్న ఈ కొత్తరైల్వే లైన్ కోసం ఈసారి బడ్జెట్‌లోనైనా కేటాయింపులు దక్కుతాయోనన్నది వేచిచూడాల్సి ఉంది.



కొత్త ప్రతిపాదనలు ఇవే..

అచ్చంపేట–మహబూబ్‌నగర్–తాండూర్ మార్గంలో సుమారు 180 కిలోమీటర్ల కొత్త రైల్వే లైను కోసం రూ.360 కోట్లతో గతంలో కేంద్రం ఆమోదం తెలిపింది. దీనికి ఇప్పటి వరకు నిధులు కేటాయించకపోవడంతో కాగితాలకే పరిమితమై ప్రతిపాదన దశలోనే ఉంది. 2007లో రూ.340 కోట్లతో ప్రతిపాదించిన జడ్చర్ల–నాగర్‌కర్నూల్–కొల్లాపూర్–నంద్యాల వరకు 170 కిలోమీటర్ల రైలు మార్గం ఆచరణలో అమలు కాలేదు. ఆయా లైన్లలో కనీసం ఒకటి, రెండు ప్రాజెక్టులకైనా తగిన కేటాయింపులు దక్కుతాయని ఉమ్మడి జిల్లావాసులు ఆశిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాకు కావాల్సిన వాటిపై విన్నవించాం..



ఉమ్మడి పాలమూరు జిల్లాలో రైల్వే లైన్ల నిర్మాణం కోసం ఇప్పటికే కేంద్ర మంత్రులను పలుమార్లు కలసి విజ్ఞప్తి చేశాం. ప్రతిసారి తెలంగాణకు అన్యాయం జరుగుతోందని, ఈ సారైనా తగిన మేరకు కేటాయింపులు జరపాలని విన్నవించాం. గద్వాల–డోర్నకల్ మార్గానికి ఈసారి బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని కోరాం. పాలమూరు వ్యాప్తంగా రవాణా సౌకర్యాలు పెంచేందుకు కృషి చేస్తున్నాం.

– మల్లు రవి, ఎంపీ, నాగర్‌కర్నూల్

నిధులు వస్తాయని ఆశిస్తున్నాం..



ఉమ్మడి పాలమూరు జిల్లాలో ప్రతిపాదించిన రైల్వే లైన్ ప్రాజెక్టులకు అవసరమైన నిధులను కేంద్రం మంజూరు చేస్తుందన్న నమ్మకం ఉంది. మహబూబ్‌నగర్–తాండూరు రైల్వే లైన్‌తో పాటు గద్వాల–డోర్నకల్ రైలు మార్గం నిర్మాణం కోసం నిధులు కేటాయించాలని ఇప్పటికే విజ్ఞప్తి చేశాం. ఇప్పటికే ఉన్న రైల్వేలైన్లు, స్టేషన్ల ఆధునికీకరణ పనులు కొనసాగుతున్నాయి.

– డీకే అరుణ, ఎంపీ, మహబూబ్‌నగర్

శిశు మరణాలు తగ్గించేందుకు కృషి చేయాలి



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): శిశు మరణాలు తగ్గించేందుకు కృషి చేయాలని కలెక్టర్ విజయేందిర సూచించారు. గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మినీ సమావేశ మందిరంలో శిశు మరణాలపై జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. స్త్రీ గర్భవతిగా ఉన్నప్పటి నుంచి జాగ్రత్తలు తీసుకోవాలని, మేనరికపు వివాహాలు చేసుకోకపోవటం మంచిదని సూచించారు. ప్రతి గర్భిణీ యొక్క గత కాన్పుల వివరాలు తీసుకోవాలని, రక్త పరీక్షలు నిర్వహించి వారి స్థితిగతులను అంచనా వేసి నాణ్యమైన పోషకాహారం అందించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను సంప్రదించాలని, గర్భిణులను పరీక్షించి సరైన సమయానికి వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. పుట్టిన పిల్లలకు సరైన సమయంలో టీకాలు ఇప్పించాలని, పాలు పట్టే విధానం బాలింత తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తల్లి బిడ్డల ఆరోగ్యం గురించి అంగన్‌వాడీలు, ఆశాలు అవగాహన కల్పించాలన్నారు. సమీక్షలో డీఎంహెచ్ఓ డాక్టర్ కృష్ణ, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారిణి డా.పద్మజ, జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సంపత్ కుమార్, డిప్యూటీ డీఎంహెచ్ఓ శ్రీధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా నియంత్రణకు చర్యలు తీసుకోవాలి

జిల్లాలో ఇసుక అక్రమ రవాణా నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ విజయేందిర ఆదేశించారు. తహసీల్దార్లు, డీటీలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఫిల్టర్ ఇసుక తయారు చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రేషన్‌కార్డులకు వచ్చిన దరఖాస్తులు అన్ని పరిశీలించి అర్హులైన జాబితా తయారు చేయాలని సూచించారు. రేషన్‌కార్డులలో కుటుంబసభ్యుల పేర్లు చేర్పులు, మార్పులను పరిశీలించి మీసేవ ద్వారా పంపించాలన్నారు. సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్‌రావు, ఆర్‌డీఓ నవీన్ పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలి

- ట్రాఫిక్ నిబంధనల పట్ల బాధ్యతగా ఉండాలి: ఎస్పీ డి.జానకి



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

మహబూబ్‌నగర్ క్రైం: మాదకద్రవ్యాల వినియోగం వల్ల యువత భవిష్యత్‌ను తీవ్రంగా ప్రభావితం చేస్తుందని, ఇది దేశ ప్రగతికి ఒక అడ్డంకిగా మారుతుందని ఎస్పీ డి.జానకి అన్నారు. జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం మాదకద్రవ్యాలు, ట్రాఫిక్ నిబంధనలు, సైబర్ నేరాలు, బాలికల రక్షణ అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, వాటి వ్యాప్తిని అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు గణనీయంగా పెరుగుతున్న దృష్ట్యా, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటించాల్సిన అవసరం ఉందని, ద్విచక్ర వాహనం నడిపే సమయంలో తప్పక హెల్మెట్ వాడాలని, కారు నడిపే క్రమంలో సీటు బెల్టు ధరించాలన్నారు. రాంగ్‌రూట్ డ్రైవింగ్, రాష్ డ్రైవింగ్, నిర్లక్ష్యంగా నడపటం వంటివి మానుకోవడం వల్ల ప్రాణాలు కాపాడుతాయని తెలిపారు. సైబర్ నేరాలు పెరిగిన నేపథ్యంలో సోషల్ మీడియా వాడకంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అజ్ఞాత లింకులు క్లిక్ చేయడం, ఓటీపీలు షేర్ చేయడం, వ్యక్తిగత సమాచారం తెలియజేయడం వంటివి ప్రమాదకరమన్నారు. ప్రధానంగా యువత సైబర్‌నేరాల పట్ల పూర్తిగా అప్రమత్తంగా ఉండాలన్నారు. బాలికల రక్షణ కోసం భరోసా కేంద్రం, షీటీం పని చేస్తుందని అవసరమైన బాధితులు 87126 59365 ద్వారా ఫిర్యాదు చేయాలన్నారు. ఉమ్మడి జిల్లా నార్కొటిక్ డీఎస్పీ బుచ్చయ్య మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రాన్ని డ్రగ్ ఫ్రీ రాష్ట్రంగా చేయాలనే లక్ష్యంతో టీజీఎన్‌బీ స్థానిక పోలీసుల సహకారంతో డ్రగ్స్‌పై అవగాహన చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం డ్రగ్స్ వినియోగం చేయరాదని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఏఎస్పీ రాములు, డీఎస్పీలు సుదర్శన్, రమణారెడ్డి, ప్రిన్సిపాల్ విజయ్‌బాబు, సీఐలు అప్పయ్య, భగవంతు రెడ్డి, ఎస్ఐ సుజాత పాల్గొన్నారు.

420 హామీలు.. 420 రోజులైనా అమలు కాలేదు



గడియారం చౌరస్తాలో బైఠాయించిన మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 420 హామీలు 420 రోజులైనా ఒక్కటి కూడా అమలుకు నోచుకోలేదని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీలను అమలు చేసే విధంగా చూడాలని బీఆర్ఎస్ నాయకులు గురువారం మహాత్మాగాంధీ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. అనంతరం గడియంచౌరస్తాలో నోటికి నల్ల వస్త్రం కట్టుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధపు హామీలు ఇచ్చి ప్రజలను అయోమయానికి గురిచేసి అధికారంలోకి వచ్చిందన్నారు. రైతులు, సామాన్య ప్రజలను ఎవరిని కదిలించినా ప్రభుత్వంపై ఆవేశంతో ఉన్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీలోని కొంతమంది నాయకులు తప్ప ఎవరూ రాష్ట్రంలో సంతోషంగా లేరన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు దరఖాస్తుల డ్రామా ఆడుతున్నారని ఆరోపించారు. విచారణల పేరుతో ప్రజలను మోసం చేయాలని చూస్తున్నారని, దరఖాస్తులు ఎందుకు తీసుకుంటున్నారో ప్రభుత్వంలో ఉన్న వాళ్లకు స్పష్టత లేదని విమర్శించారు. సీఎం ఒక మాట, మంత్రులు ఒక మాట మాట్లాడుతూ ప్రజలను గందరగోళం చేస్తున్నారన్నారు. అధికారులు అనవసరంగా చట్టానికి వ్యతిరేకంగా పని చేయవద్దని అన్నారు. ఏ ఎన్నికలు వచ్చినా ప్రభుత్వానికి సమాధానం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ మాజీ చైర్మన్ రాజేశ్వర్ గౌడ్, మున్సిపల్ మాజీచైర్మన్ నర్సింహులు, ముడా మాజీచైర్మన్ గంజి వెంకన్న, రవీందర్‌రెడ్డి, శివరాజ్, చెన్నయ్య, పటేల్ ప్రవీణ్‌కుమార్, నవకాంత్, శ్రీనివాస్‌రెడ్డి, అహ్మదుద్దీన్, పాలసతీష్, జంబులయ్య, ఇమ్రాన్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

లక్ష్యంలో సగమైనా చేరుకోలే..!

- పాలమూరులో ఆస్తిపన్ను వసూళ్లు 31 శాతమే
- భూత్పూర్‌లో 39, జడ్చర్లలో 36 శాతం మాత్రమే వసూలు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లాలోని మూడు మున్సిపాలిటీల్లో ఆస్తి పన్ను వసూళ్లు మందగించాయి. ఈ ఆర్థిక సంవత్సరం (2024–25) ముగియడానికి కేవలం రెండు నెలల గడువే మిగిలింది. అయినప్పటికీ లక్ష్యంలో సగమైనా చేరుకోలేకపోయారు. ముఖ్యంగా మున్సిపల్ అధికారులు, సిబ్బంది కొన్ని రోజులుగా వివిధ సర్వేలలో నిమగ్నం కావడంతో ఈ పరిస్థితి నెలకొంది. గత ఏడాది ఆగస్టు నుంచి అక్టోబర్ వరకు ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆ తర్వాత కుటుంబ సమగ్ర సర్వే, డిసెంబర్, జనవరి మాసాల్లో ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్‌కార్డులు, రైతు భరోసా పథకం సర్వేలు కొనసాగాయి. దీంతో ఆస్తిపన్ను వసూలుపై దృష్టి పెట్టలేకపోయారు.



గడువులోగా వసూలుకు యత్నిస్తాం



కొన్ని నెలలుగా పట్టణంలో వివిధ సర్వేల కారణంగా ఆస్తి పన్ను వసూళ్లపై దృష్టి పెట్టలేకపోయాం. ప్రస్తుతం సర్వే పనులు పూర్తి కావడంతో ఆస్తిపన్ను వసూలు చేయడంపై దృష్టి సారిస్తాం. ఇంకా రెండు నెలల గడువు ఉన్నందున మా వంతు ప్రయత్నాలు ముమ్మరం చేస్తాం.

– డి.మహేశ్వర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, మహబూబ్‌నగర్

3 మున్సిపాలిటీలలో ఇలా..


మహబూబ్‌నగర్‌లోని 49 వార్డుల పరిధిలో మొత్తం 51,117 అసెస్‌మెంట్ల (ఇళ్లు, వ్యాపార భవన సముదాయాలు, వివిధ ఫ్యాక్టరీలు)కు గాను ఈ ఏడాది రూ.20,60,95,000 ఆస్తిపన్ను రావచ్చని అంచనా వేశారు. పాత బకాయిల కింద రూ.28,95,24,000తో కలిపి మొత్తం రూ.49,56,20,000 వసూలు కావాలి. అయితే ఈ ఏడాదికి సంబంధించి ఇప్పటి వరకు రూ.10,52,49,000, పాత బకాయిల కింద రూ.2,55,09,000 కలిపి 18,258 అసెస్‌మెంట్ల నుంచి మొత్తం రూ.13,07,58,000 మాత్రమే (30.51 శాతం) రాబట్టగలిగారు. ఇక 243 కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల నుంచి ఈ ఏడాది రూ.69.53 లక్షల ఆస్తి పన్ను రావచ్చని అంచనా వేశారు. పాత బకాయిల కింద రూ.15,05,41,000 కలిపి మొత్తం రూ.15.75కోట్లు వసూలు కావాలి. కాగా..ఇప్పటివరకు 34 అసెస్‌మెంట్ల నుంచి రూ.16.31 లక్షలు మాత్రమే (0.94 శాతం) రాబట్టగలిగారు.



పాతగంజ్‌లోని ఓ ఇంటి యజమాని నుంచి ఆస్తి పన్ను వసూలు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

- భూత్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని పది వార్డులలో మొత్తం 3,445 అసెస్‌మెంట్లకు గాను ఈ ఏడాది రూ.2,03,62,000 ఆస్తిపన్ను రావచ్చని అంచనా వేశారు. పాత బకాయిల కింద రూ.86,87,000 కలిపి మొత్తం రూ.2,90,49,000 వసూలు కావాలి. అయితే ఈ ఏడాదికి సంబంధించి ఇప్పటివరకు రూ.1,08,50,000, పాత బకాయిల కింద రూ.8.33లక్షలు కలిపి 1,088 అసెస్‌మెంట్ల నుంచి మొత్తం రూ.1,16,83,000 (39.77 శాతం) రాబట్టగలిగారు. ఇక 8 కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల నుంచి ఈ ఏడాది రూ.96 వేలు ఆస్తి పన్ను రావచ్చని అంచనా వేశారు. పాత బకాయిల కింద రూ.2.34 లక్షలు మొత్తం రూ.3.30 లక్షలు వసూలు కావాలి. అయితే ఇప్పటివరకు ఒకే కార్యాలయం నుంచి కేవలం రూ.3 వేలు మాత్రమే (0.77 శాతం) రాబట్టగలిగారు.
- జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని 27 వార్డులలో మొత్తం 18,273 అసెస్‌మెంట్లకు గాను ఈ ఏడాది రూ.3,52,55,000 ఆస్తిపన్ను రావచ్చని అంచనా వేశారు. పాత బకాయిల కింద రూ.2,27,69,000 కలిపి మొత్తం రూ.5,80,24,000 వసూలు కావాలి. అయితే ఈ ఏడాదికి సంబంధించి ఇప్పటివరకు రూ.1,95,95,000, పాత బకాయిల కింద రూ.14,58,000 కలిపి 7,313 అసెస్‌మెంట్ల నుంచి మొత్తం రూ.2,10,53,000 మాత్రమే (36.31 శాతం) రాబట్టగలిగారు. ఇక 101 కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల నుంచి ఈ ఏడాది రూ.11 లక్షలు ఆస్తి పన్ను రావచ్చని అంచనా వేశారు. పాత బకాయిల కింద రూ.41 లక్షలు కలిపి మొత్తం రూ.52 లక్షలు వసూలు కావాలి. అయితే ఇప్పటివరకు 20 అసెస్‌మెంట్ల నుంచి రూ.2 లక్షలుమాత్రమే (4 శాతం) రాబట్టగలిగారు.

వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు



వీసీలో మాట్లాడుతున్న భగీరథ ఈఈ పుల్లారెడ్డి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): వచ్చే వేసవి కాలంలో ప్రజలకు నీటి ఎద్దడి లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలని మిషన్ భగీరథ ఈఈ పుల్లారెడ్డి అన్నారు. ఈ మేరకు డీపీఓ పార్థసారధితో కలిసి ఆయన మిషన్ భగీరథ వేసవి యాక్షన్ ప్లాన్‌పై క్షేత్రస్థాయి అధికారులతో వీసీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 1వ తేదీ నుంచి 10వ తేదీ వరకు గ్రామాల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీలు ఉన్నాయో పరిశీలించాలని సూచించారు. గ్రామాల్లోని ఓవర్ హెడ్ ట్యాంక్‌లను శుభ్రం చేసుకోవాలని, ప్రజలకు నీటి సమస్య రాకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఫిబ్రవరి 1వ తేదీ నుంచి 10వ తేదీ వరకు గ్రామాల్లో ఆయా మండల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని గ్రామ పంచాయతీ కార్యదర్శులతో ఎప్పటికప్పుడు రివ్యూ చేసుకోవాలన్నారు. మండల అధికారులు పంచాయతీ కార్యదర్శులతో సమన్వయం చేసుకోవాలని, సమస్యల తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో వచ్చే సమస్యలపై ఫిర్యాదులు చేయడానికి టోల్ ఫ్రీ నంబర్ 1800 599 4007ను ఏర్పాటు చేశామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో కూలీ మృతి

అచ్చంపేట రూరల్: విద్యుదాఘాతంతో దినసరి కూలీ మృతిచెందిన ఘటన అచ్చంపేట మండలం పులిజాల శివారులో గురువారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. ఉప్పునుంతలకు చెందిన మదనాగుల భాస్కర్ (39) విద్యుత్‌శాఖ కాంట్రాక్టర్ వద్ద దినసరి కూలీగా పనిచేసేవాడు. ఈ క్రమంలో పులిజాల గ్రామ శివారులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ బిగింపు, విద్యుత్ లైన్ సరిచేయడానికి సదరు కాంట్రాక్టర్, తోటి కూలీలతో కలిసి వెళ్లాడు. అక్కడ 11కేవీ లైన్ క్లియర్ కోసం తాడూరు సబ్‌స్టేషన్‌కు ఫోన్‌చేసి ఎల్‌సీ తీసుకున్నారు. అయితే అచ్చంపేట సబ్‌స్టేషన్‌కు సంబంధించిన 11కేవీ అని గమనించకుండా స్తంభం ఎక్కిన భాస్కర్.. విద్యుత్ షాక్‌కు గురై కిందపడ్డాడు. అతడిని వెంటనే కల్వకుర్తి సమీపంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య శారదతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ ఘటనపై అచ్చంపేట పోలీస్‌స్టేషన్‌లో మృతుడి కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిసింది. కాంట్రాక్టర్, విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యంతోనే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.

దుకాణాల్లో చోరీ

కేటీదొడ్డి: మండలంలోని మైలగడ్డ సమీపంలోని పలు దుకాణాల్లో గుర్తు తెలియని వ్యక్తులు గురువారం తెల్లవారు జామున చోరీకి పాల్పడ్డారు. బాధితుల వివరాల మేరకు.. కేటీదొడ్డి మండలం రాయచూర్ ప్రధాన రహదారిపై మైలగడ్డ స్టేజీ సమీపంలో మైలగడ్డ, గంగన్‌పల్లి గ్రామాలకు చెందిన వ్యక్తులు రేకులషెడ్డులో చిరు వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. మైలగడ్డ స్టేజీ వద్ద ఫర్టిలైజర్, ఆన్‌లైన్, సీఎస్‌సీ సెంటర్, కిరాణం, ఇంజినీరింగ్ వర్క్‌షాపు, మోటార్ వైండింగ్ దుకాణాల్లో వెనుక భాగంలో రేకులను గుర్తు తెలియని వ్యక్తులు కట్ చేసి లోనికి ప్రవేశించారు. ఫర్టిలైజర్ దుకాణాల్లో సుమారు రూ. 10 వేలు, ఒక సెల్‌ఫోన్, సీఎస్‌సీ సెంటర్‌లో నగదు, కిరాణం దుకాణంలో రూ.3 వేలు, మోటార్ వైండింగ్ షాపులో రూ.లక్ష విలువైన కాపర్ వైర్ చోరీ చేశారు. ఉదయం దుకాణాలు తెరిచిన యాజమానులు కౌంటర్లు తెరిచి ఉండటం గమనించి దొంగతనం జరిగిందని గుర్తించారు. బాధితులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలాన్ని చేరుకున్న పోలీసులు దుకాణాల్లో ఉన్న సీసీ కెమెరాలు పరిశీలించి వివరాలు సేకరించారు. రాత్రి వేళలో పోలీసుల నిఘా లేకపోవడంతోనే వరుస సంఘటనలు జరుగుతున్నాయని మండల ప్రజలు ఆరోపించారు. రాత్రి వేళలో పోలీసుల గస్తీ పెంచాలని మండల ప్రజలు కోరారు.

బాల కార్మిక వ్యవస్థను రూపుమాపాలి

పాలమూరు: జిల్లాలో బాల కార్మికులను తగ్గించడానికి చైల్డ్ వెల్ఫేర్ కమిటీ కృషి చేయాలని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి డి.ఇందిర సూచించారు. జిల్లాకేంద్రంలోని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ కార్యాలయంలో గురువారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. సమాజంలో బాలకార్మిక వ్యవస్థను పూర్తిగా అరికట్టాలన్నారు. బాల కార్మికులు, బాల్య వివాహాలు, బాలల హక్కులు, వారి బాధ్యతలపై అవగాహన కల్పించారు. అనంతరం లీగల్ సర్వీసెస్ క్లినిక్‌లను ప్రారంభించారు. దీంతో పాటు ఆపరేషన్ స్మైల్ ద్వారా 8 మంది బాల కార్మికులను వెట్టి చాకిరీ పనుల నుంచి రక్షించి వారి హక్కులు, బాధ్యతలను వారికి వివరించారు.

ఆశజూపి.. డబ్బు కాజేసి..

రూ.కోటికి పైగా దోచుకున్న వైనం



హైదరాబాద్‌లో కంపెనీ నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న బాధితులు (ఫైల్)

- ఒక్కసారి పెట్టుబడి.. జీవితాంతం రాబడి అంటూ ప్రచారం
- ఆటో, కారు డ్రైవర్లు, చిరు వ్యాపారులే లక్ష్యంగా
- సుమారు 600 మందికి పైగా బాధితులు



కోస్గి: సైబర్ నేరాల కట్టడికి పోలీసులు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా.. కొత్త ఎత్తుగడలతో సైబర్ నేరగాళ్లు యథేచ్ఛగా తమ మోసాలను కొనసాగిస్తున్నారు. ఎవరి ప్రమేయం అవసరం లేదు.. రోజు ఆదాయమే.. నేరుగా మీ బ్యాంకు ఖాతాలోనే డబ్బులు జమవుతాయంటూ అత్యాశ జూపి ఏకంగా రూ.కోటికి పైగా దోచుకున్న ఘటన పట్టణంలో తాజాగా వెలుగుచూసింది. వివరాల్లోకి వెళ్తే.. హైదరాబాద్‌కు చెందిన కొందరు గ్రామీణ ప్రాంతాల్లో ఏజెంట్లను నియమించుకొన్నారు. ప్రభుత్వ అనుమతులతో ఆర్‌పీసీ (రికార్డెడ్ పిక్చర్ కంపెనీ) ఏర్పాటు చేశామని.. నేరుగా కంపెని యాప్‌లో ఒకసారి రూ.18 వేలు పెట్టుబడి పెట్టడంతో పాటు మరో ముగ్గురిని చేర్పిస్తే రోజు రూ.600 చొప్పున జీవితాంతం నేరుగా బ్యాంకు ఖాతాలో నగదు జమ అవుతుందని విస్తృత ప్రచారం చేశారు. నెల రోజుల వ్యవధిలో కోస్గి, పరిసర గ్రామాల్లోని ఆటో, కారు డ్రైవర్లు, చిరు వ్యాపారులు ఇలా సుమారు 600 మందికి పైగా పెట్టుబడి పెట్టారు. వారిలో పదుల సంఖ్యలో కొందరికి రోజుకు రూ.600 చొప్పున జమ అవుతుండటంతో నమ్మకం పెరిగింది. దీంతో ఎందరో యువకులు, వ్యాపారులు తమ స్నేహితులు, బంధువులతో పెట్టుబడి పెట్టించారు.

ఫిర్యాదు చేస్తే విచారణ చేస్తాం..



ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదు. బాధితులు ముందుకొచ్చి పూర్తి వివరాలు అందిస్తే ఉన్నతాధికారులకు తెలియజేసి పోలీసుశాఖ తరుపున న్యాయం చేసేందుకు సిద్ధంగా ఉన్నాం. ఆన్‌లైన్ పెట్టుబడులు, లోన్ల పేరుతో ఫోన్‌కాల్స్, ఓటీపీలు అడిగితే చెప్పొద్దు. సైబర్ నేరాలను అడ్డుకునేందుకు పోలీసుశాఖ తరుపున అవగాహన కల్పిస్తున్నాం. ప్రజలు సైతం అప్రమత్తంగా ఉండాలి.

– బాలరాజు, ఎస్‌ఐ, కోస్గి

ఒకరిపై ఒకరు విమర్శలు..

బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడం మాని ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటున్నారు. నీలాగే నేను మోసపోయానంటూ ఒకరు.. నా డబ్బులు నీవే చెల్లించాలంటూ మరొకరు మూడురోజులుగా అంతర్గతంగా చర్చించుకుంటుండటంతో ఆ నోట, ఈ నోట అసలు విషయం వెలుగులోకి వచ్చింది. కాగా ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు సైతం భయపడుతున్నారు. వెలుగులోకి వచ్చిన బాధితులు కొందరేనని.. పేర్లు చెప్పుకోలేని కొందరు నాయకులు, బడా వ్యాపారులు మరెందరో ఉన్నట్లు బహిరంగంగానే చర్చ జరుగుతోంది.

హైదరాబాద్‌లో మందు, విందు..

నిర్ణీత లక్ష్యాన్ని పూర్తి చేయడంతో కంపెనీ వారు ప్రత్యేక విందు ఏర్పాటు చేశారంటూ పెట్టుబడి పెట్టిన వారందరిని గత ఆదివారం హైదరాబాద్‌కు ఆహ్వానించారు. దీంతో పలువురు పెట్టుబడిదారులు సొంత ఖర్చులతో వాహనాలు ఏర్పాటు చేసుకొని వెళ్లారు. అక్కడ ముందుగా కేక్ కట్‌చేసిన అనంతరం నాన్ వెజ్‌తో విందు, డ్యాన్సర్లతో చిందు ఏర్పాటు చేశారు. పెట్టుబడిదారులందరూ కంపెనీలో వాటాదారులంటూ గొప్పగొప్ప మాటలు చెప్పి త్వరలోనే మీకు రోజు ఆదాయం మొదలవుతుందంటూ మరోమారు వివరాలు సేకరించారు. మరుసటి రోజు సోమవారం నుంచి యాప్ పనిచేయకపోవడంతో పెట్టుబడిదారులు కంగుతిన్నారు. సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ అంటూ ఓసారి.. లెక్కలు చూస్తున్నారంటూ మరోసారి ప్రతినిధుల నుంచి పొంతన లేని సమాధానాలు వచ్చాయి. తర్వాత వారి సెల్‌ఫోన్లన్నీ ఒక్కసారిగా మోగకపోవడంతో మోసపోయామని అసలు విషయం గ్రహించారు. రూ.కోటికి పైగా దోచుకెళ్లారని.. ఎవరికి చెప్పుకోలేక బాధితులు లబోదిబోమంటున్నారు.

రన్నరప్‌గా ఉమ్మడి పాలమూరు


రన్నరప్ జట్టుతో టీడీసీఏ అధ్యక్షుడు అల్లీపురం వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు

- ఉత్కంఠగా సాగిన టీడీసీఏ టోర్నీ ఫైనల్ మ్యాచ్
- బెస్ట్ ఆల్ రౌండర్‌గా రవితేజ, బెస్ట్ కీపర్‌గా వీరేందర్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: హైదరాబాద్‌లోని దోమలగూడలో గురువారం జరిగిన తెలంగాణ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ (టీడీసీఏ) అంతర్ జిల్లా టీ–20 క్రికెట్ టోర్నీలో ఫైనల్ మ్యాచ్ ఉత్కంఠగా సాగింది. ఇందులో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జట్టుపై టీడీసీఏ ఎలెవన్ జట్టు 13 పరుగుల తేడాతో విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన టీడీసీఏ ఎలెవన్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి 182 పరుగులు చేసింది. జట్టులో మహేష్‌జాదవ్ 102 పరుగులు, శివశంకర్ 52 పరుగులు చేశారు. జిల్లా బౌలర్లు రవితేజ రెండు, దీక్షిత్‌పాటిల్, శశి చెరో వికెట్ తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన జిల్లా జట్టు 19.3 ఓవర్లలో 169 పరుగులకు ఆలవుట్ అయింది. జట్టులో సంజు 41, వీరేందర్ 27 పరుగులు చేశారు. ఈ టోర్నీలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జట్టుకు చెందిన బెస్ట్ ఆల్ రౌండర్‌గా రవితేజ, బెస్ట్ కీపర్‌గా వీరేందర్ నిలిచారు. విన్నర్, రన్నర్ జట్లకు టీడీసీఏ అధ్యక్షుడు అల్లీపురం వెంకటేశ్వర్‌రెడ్డి ట్రోఫీలు అందజేశారు. కాగా, ఉమ్మడి జిల్లా జట్టు రన్నరప్‌గా నిలవడంపై సంఘం ఉమ్మడి జిల్లా కన్వీనర్ నవీన్ కుమార్, జట్టు మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి, కోచ్ నవాజ్ షా అభినందించారు. కార్యక్రమంలో ఎస్‌ఆర్‌ఐ సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పూర్తిస్థాయి నీటిమట్టం

మదనాపురం: రామన్‌పాడులో గురువారం పూర్తిస్థాయి నీటిమట్టం 1,021 అడుగులకు వచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 920 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. సమాంతర కాల్వ ద్వారా వచ్చే నీటిని నిలిపివేశారు. ఎన్టీఆర్ కాల్వ ద్వారా 800 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని ఏఈ వరప్రసాద్ తెలిపారు.

మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు



పాలమూరు: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని వెంకటేశ్వర్ల కాలనీలో బెస్ స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణ పేరుతో జరుగుతున్న అక్రమాలు, అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్న సైకాలజిస్ట్ లక్ష్మణ్‌పై గురువారం జిల్లా చైతన్య మహిళా సంఘం ఆధ్వర్యంలో బాధిత మహిళలు హైదరాబాద్‌లో మానక హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఇద్దరు మహిళా బాధితులు నష్టపోయిన అంశాన్ని లిఖిత పూర్వకంగా మానవ హక్కుల కమిషన్‌కు లేఖ అందించారు. లక్ష్మణ్‌పై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు అరెస్టు చేయాలని కోరారు.

లక్ష్మీచెన్నకేశవుడి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

జడ్చర్ల టౌన్: మండలంలోని గంగాపురం లక్ష్మీచెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు గురువారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా పుణ్యాహవాచనం జరిపించి స్వామి, అమ్మవార్లకు 108 కలశాలతో అభిషేకం చేశారు. అలంకరణ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి దీప్తిరెడ్డితో పాటు పాలకమండలి సభ్యులు జనార్దన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, గోపాల్, కుంబ జంగయ్య, విశ్వంగుప్త, భీమస్వామి, నారాయణరెడ్డి, రాంచంద్రయ్యయాదవ్, శంకర్, బూర్గుల శేఖర్‌లతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.


స్వామిని దర్శించుకుంటున్న భక్తులు


కలశాలకు పూజలు చేస్తున్న పురోహితులు

‘ప్రజల సమక్షంలో చర్చలు జరపాలి’

రాజోళి: మండలంలోని పెద్ద ధన్వాడలో ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటు అంశాన్ని ప్రజల సమక్షంలోనే చర్చలు జరపాలని ఫ్యాక్టరీ వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు కోరారు. ఫ్యాక్టరీ నిర్మాణానికి వ్యతిరేకంగా పలు గ్రామాల ప్రజలు చేస్తున్న రిలే దీక్షలు గురువారం ఎనిమిదో రోజుకు చేరాయి. ఫ్యాక్టరీ యాజమాన్యంతో చర్చించేందుకు ఏర్పాటు చేస్తామని.. దీక్ష విరమించాలని శాంతినగర్ సీఐ టాటా బాబు, తహసీల్దార్ పి.రామ్మోహన్ కోరారు. కలెక్టరేట్, ప్రభుత్వ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేస్తామని.. ఎలాంటి సమస్యలు ఉత్పన్నమవుతాయి.. వాటిని ఏ విధంగా పరిష్కరిస్తారు? అనే అంశాలతో పాటు అసలు ఫ్యాక్టరీ ఏర్పాటును వ్యతిరేకించేందుకు గల కారణాలు వివరించాలని సూచించారు. ఇందుకు దీక్ష చేస్తున్న వారు ఒప్పుకోలేదు. ఎలాంటి చర్చ అయినా 13 గ్రామాల ప్రజల సమక్షంలోనే జరగాలని.. అంతవరకు తాము దీక్ష విరమించబోమని తేల్చిచెప్పడంతో అధికారులు వెనుదిరిగారు.


ఫ్యాక్టరీ వ్యతిరేక పోరాట సమితి నాయకులతో మాట్లాడుతున్న సీఐ, తహసీల్దార్

తల్లీకుమారుల ఆత్మహత్యాయత్నం

- భూ సర్వేను అడ్డుకోవడంతో ఒంటిపై పెట్రోల్ పోసుకున్న వైనం

గట్టు: తమ పేరున పట్టా ఉండి, తమ స్వాధీనంలో ఉన్న భూమిని సర్వే చేయకుండా కొందరు అడ్డుపడటంతో తల్లీకుమారులు ఒంటిపై పెట్రోలు పోసుకొని నిప్పంటించునేందుకు యత్నించిన ఘటన గురువారం మండలంలోని రాయాపురం శివారులో చోటు చేసుకుంది. బాధిత రైతుల కథనం మేరకు.. పెంచికలపాడుకు చెందిన ఉమామహేశ్వరి, రఘువంశీకి రాయాపురం గ్రామ శివారులో 7.04 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. వీరి పొలం కబ్జాకు గురికావడంతో సర్వే చేసుకొని హద్దులు ఏర్పాటు చేసుకునేందుకు సిద్ధమయ్యారు. గురువారం సర్వే అధికారులు గ్రామానికి పోలీస్ బందోబస్తుతో వచ్చారు. అయినప్పటికీ గ్రామానికి చెందిన వగ్గాని రాముడు, చెవిటి మహదేవ్, వెంకటేష్ సర్వేను అడ్డుకోవడంతో కాసేపు వాగ్వాదం చోటు చేసుకుంది. అధికారులు కూడా సర్వేకు అయిష్టం చూపడంతో ఇక లాభం లేదనుకొని తల్లీ కుమారులు ఉమామహేశ్వరి, రఘువంశీ ఒంటిపై పెట్రోలు పోసుకున్నారు. సర్వే చేయకుంటే నిప్పంటించుకొని చనిపోతామంటూ బెదిరించడంతో చివరికి అధికారులు సర్వే ముగించారు. వివాదం సద్దుమణగడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.


ఘటన స్థలంలో ఉమామహేశ్వరి, రఘువంశీ

గొర్రెల మందపైకి దూసుకెళ్లిన డీసీఎం

- 8 గొర్రెలు మృతి

లింగాల: మండలంలోని అంబట్‌పల్లి శివారులో యాపట్ల వెళ్లే మార్గంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో 8 గొర్రెలు మృత్యువాత పడగా, పలు గొర్రెలకు కాళ్లు విరిగిన సంఘటన చోటుచేసుకుంది. బాధితుల వివరాల ప్రకారం.. కొల్లాపూర్ మండలం కుడికిళ్ల గ్రామానికి చెందిన ఏడుపుల బాలపీరుకు చెందిన 200 గొర్రెలను రోడ్డుమార్గం గుండా లింగాల మండలం సూరాపూర్ ప్రాంతానికి తరలిస్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది. మండలంలోని జీల్గుపల్లికి చెందిన ప్రసాద్ కొంతమంది రైతులకు సంబంధించిన ధాన్యం సింగోటం తరలిస్తున్నాడు. మద్యంమత్తులో ఉన్న డ్రైవర్ ఎదురుగా వస్తున్న గొర్రెల మందపై డీసీఎంను తీసుకెళ్లాడు. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి డీసీఎంను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.



వైభవంగా జోగులాంబ బ్రహ్మోత్సవాలు

- అమ్మవారికి ప్రత్యేక పూజలు
- త్రిశూల భేరితో ఆనతి స్వీకరించిన అర్చకులు
- వేద మంత్రాలతో మార్మోగిన ఆలయాలు


జోగులాంబ ఆలయం వద్ద ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

అలంపూర్: అలంపూర్ క్షేత్రంలో జోగుళాంబ అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ప్రతి ఏడాది మాఘశుద్ధ పాడ్యమి నుంచి మాఘశుద్ధ పంచమి వరకు అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అందులో భాగంగా ఆలయ ఈఓ పురేందర్ కుమార్, కమిటీ చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి వార్షిక ఉత్సవాలను లాంచనంగా ప్రారంభించారు. ఆలయ అర్చకులు జోగుళాంబ అమ్మవారికి వేద మంత్రాలతో హారతులు సమర్పించారు. అనంతరం అమ్మవారి ఆలయం నుంచి బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయానికి చేరుకుని ఆగమ పద్ధతులతో ఆనతి స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. అక్కడ ఉత్సవ బలిభేరి పల్లకీలో కొలువుదీరగా.. గోవుతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అక్కడి నుంచి ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. ఉత్సవ త్రిశూల బలిభేరితో ఆలయం వద్ద ప్రదక్షిణ అనంతరం యాగశాల ప్రవేశం చేశారు. స్వామి, అమ్మవార్లకు ఆలయ ఈఓ పట్టువస్త్రాలను సమర్పించారు. అనంతరం గణపతి పూజ, మహా సంకల్పం, పుణ్యాహవచనం, రుత్విక్‌వరణం వంటి ప్రత్యేక పూజలు చేశారు. సకల దేవతా మూర్తులకు నిలయమైన సర్వతోభద్రమండపాన్ని ఏర్పాటుచేసి.. ఆవాహిత దేవతలకు పూజలు నిర్వహించారు. అనంతరం కలశ స్థాపన చేశారు. అదే విధంగా అమ్మవారి కుంకుమార్చన మండపంలో సహస్ర ఘటాలను ఏర్పాటుచేసి.. సర్వతోభద్రమండలి వద్ద ముక్కోటి దేవతలను ఆవాహనం చేశారు. త్రికాల సమయాలలో దిక్పాలక బలిహరణ, ప్రదోషకాలంలో మృత్ సంగ్రహణం, బ్రహోత్సవాలకు అంకురార్పన వంటి కార్యక్రమాలు విశేషంగా జరిగాయి.

దేవాదాయశాఖ మంత్రికి ఆహ్వానం

అలంపూర్ క్షేత్రంలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహోత్సవాలకు రావాలని దేవాదాయశాఖ కొండారెడ్డిని ఆహ్వానించారు. గురువారం ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఆలయ ఈఓ పురేందర్ కుమార్, అర్చకులు మంత్రిని కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. అదే విధంగా ఫిబ్రవరి 25 నుంచి మార్చి 1వ తేదీ వరకు బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయంలో జరిగే మహాశివరాత్రి ఉత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికను అందజేశారు. అలంపూర్ క్షేత్రంలో ఫిబ్రవరి 26న జరిగే మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలకు వస్తానని మంత్రి చెప్పినట్లు వారు తెలిపారు.


మంత్రి కొండా సురేఖకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఈఓ, అర్చకులు

ఘనంగా ధ్వజారోహణం


ధ్వజారోహణం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే విజయుడు

జోగుళాంబ అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ధ్వజారోహణం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముక్కోటి దేవతలను ఆహ్వానిస్తూ ప్రదోష కాలంలో ధ్వజారోహణ నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే విజయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజల అనంతరం ధ్వజారోహణం నిర్వహించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ గజేందర్‌రెడ్డి, ఆలయ ధర్మకర్తలు నాగశిరోమణి, చంద్రశేఖర్ రెడ్డి, జగదీశ్వర్‌గౌడు, జగన్మోహన్ నాయుడు, పులేందర్, వెంకటేశ్వర్లు, అర్చకులు విక్రాంత్ శర్మ, అనంద్ శర్మ, శ్యాంకుమార్ శర్మ, జానకీరామశర్మ, కృష్ణమూర్తి శర్మ, ధనుంజయ శర్మ తదితరులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర నిందితులు అరెస్టు

- రూ.లక్ష, బైక్ స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ శ్రీనివాసరావు


మాట్లాడుతున్న ఎస్పీ శ్రీనివాసరావు

గద్వాల క్రైం: బ్యాంకు పరిసర ప్రాంతాల్లో వచ్చే ఖాతాదారులను ఏమార్చి నగదును చోరీ చేసే అంతర్రాష్ట్ర నిందితులను అదుపులోకి తీసుకుని రూ.లక్ష, బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఎస్పీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నెల్లూరు జిల్లా కావలి మండలం బిట్రగుంట గ్రామానికి చెందిన ఎరుకలి పిట్ల శివకుమార్, అదే గ్రామానికి చెందిన మైనర్ బాలుడు కలిసి ఈ నెల 21న శాంతినగర్‌లోని యూనియన్ బ్యాంకులో బాలసాహెబ్ వ్యక్తిగత బంగారు ఆభరణాలతో రుణం తీసుకున్నాడు. తీసుకున్న రుణం చెల్లించి ఆభరణాలు తీసుకెళ్లేందుకు బ్యాంకుకు వచ్చాడు. ఈ క్రమంలో టెక్నికల్ సమస్యల కారణంగా బ్యాంకు అధికారులు బాలసాహెబ్‌కు మరుసటి రోజు రావల్సిందిగా తెలిపారు. దీంతో తిరిగి బైక్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో గుర్తు తెలియని వ్యక్తులు వారి వద్దకు వచ్చి అడ్రస్ వివరాలు అడుగుతూ బాధితుడిని ఏమార్చి బైక్ కవర్‌లో ఉన్న రూ.లక్ష నగదును అపహరించారు. దీంతో బాధితుడు శాంతినగర్ పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారన్నారు. గురువారం ఉదయం శాంతినగర్ వస్తుండగా మద్దూర్ స్టేజీ సమీపంలో అనుమానాస్పదంగా వ్యక్తులు తచ్చాడుతుండగా, సిబ్బంది వారిని గుర్తించి అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టగా నేరం అంగీకరించారన్నారు. నిందితుల నుంచి రూ. లక్ష, ఒక బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. నిందితులు నల్గొండ జిల్లా హుజుర్‌నగర్‌లో ఒక వ్యక్తిని ఇదే తరహాలో ఈ నెల 23న ఏ మార్చి బైక్‌లో ఉన్న రూ.1. 40లక్షలను అపహరించారన్నారు. నల్గొండ జిల్లా పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైనట్లు ఎస్పీ వివరించారు. కేసు ఛేదనలో ప్రతిభ కనబర్చిన సిబ్బంది సీఐ టాటాబాబు, ఎస్‌ఐ సంతోష్, సిబ్బంది నబీరసూల్‌ను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి క్యాష్ రివార్డు అందజేశారు. బైక్, నగదును కోర్టు ద్వారా బాధితులకు అందజేస్తామన్నారు. చోరీ కేసులోని నిందితులను గద్వాల కోర్టులో హాజరుపరచి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో సీఐ నాగేశ్వర్‌రెడ్డి సిబ్బంది తదితరులు ఉన్నారు.

సైబర్ నేరం.. కేసు నమోదు

నాగర్‌కర్నూల్ క్రైం: ప్రైవేట్ యాప్‌లో పెట్టుబడి పెట్టి ఓ వ్యక్తి మోసపోయిన ఘటన జిల్లాకేంద్రంలో చోటు చేసుకున్నట్లు ఎస్‌ఐ గోవర్ధన్ గురువారం తెలిపారు. ఆయన కథనం మేరకు.. జిల్లాకేంద్రంలోని సంజయ్‌నగర్‌కాలనీకి చెందిన రాజశేఖర్ అధిక డబ్బులకు ఆశపడి డెకత్లాన్ యాప్‌లో రూ.2.10 లక్షలను జనవరి 15న పెట్టుబడిగా పెట్టాడు. ప్రస్తుతం ఆ యాప్ పనిచేయకపోవడంతో తాను మోసపోయినట్లు గుర్తించి గురువారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.